# వడివడిగా.. సంపద వనాలు

- ఇరిగేషన్ భూముల కేటాయింపు
- మండలంలో 24బ్లాకుల్లో ఏర్పాటు
- మూడు బ్లాకుల్లో పూర్తైన వనాలు



మునగాల సంపద వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక(ఫైల్)


సంపద వనంలో నాటిన మొక్కలు

మునగాల, అక్టోబర్ 8 : రాష్ట్రంలో పచ్చదనం పెంపే లక్ష్యంగా అడుగులు వేసిన ప్రభుత్వం హరితహారం కార్యక్రమంతో సత్ఫలితాలు సాధించింది. మరింత పచ్చదనం పెంపు, ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాల రక్షణకు మరో బృహత్తర కార్యక్రమం సంపద వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. వనాల ఏర్పాటుకు మండల పరిధిలో ఎడమ కాల్వ పక్కన ఇరువైపులా ఖాళీగా ఉన్న ఇరిగేషన్ శాఖ భూములను ప్రభుత్వం గుర్తించింది. ఆ భూముల్లో ఎవరి ఆధీనంలో లేకుండా ఉన్న 39ఎకరాల భూమిని వనాల ఏర్పాటుకు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బిడ్లు, బిడ్లుగా ఉన్న భూమిని ఎకరన్నర నుంచి రెండు ఎకరాలుగా 24బ్లాకులు చేశారు. బ్లాకుల్లో ప్రభుత్వ నిధుల నుంచి పనులు ప్రారంభించారు. జంగిల్ క్లియర్ చేయడం, చుట్టూ ఫెన్సింగ్‌కు గేట్, బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నది. గుంతలు తీయడం, మొక్కలు నాటడం పనులు జాతీయ ఉపాధి హామీ పథకంతో చేపట్టారు. వనాల్లో పండ్లు, కలప మొక్కలు నాటాలి. అవి అటవీ శాఖ వారు సప్లయ్ చేస్తారు. మండలంలో 24 బ్లాకుల్లోని 39ఎకరాల్లో వనాల ఏర్పాటు పనులు చేపట్టగా కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పలు దఫాలుగా పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వారి సూచన మేరకు మండల అధికారులు పనులు వేగవంతంగా చేపడుతున్నారు. 24బ్లాకుల్లోని 39 ఎకరాల్లో 26,117మొక్కలు నాటడం లక్ష్యం కాగా నేటికీ 19బ్లాకుల్లో జంగిల్ క్లియర్, ఫెన్సింగ్, గేటు ఏర్పాటు పూర్తైంది. అదేవిధంగా అట్టి బ్లాకుల్లో 18,176 మొక్కలు నాటేందుకు గుంతలు తీశారు. 19బ్లాకుల్లో మొక్కలు నాటితే దాదాపు పనులు పూర్తయినట్లే. 19బ్లాకుల్లో మూడింటిలో పనులు పూర్తై 2,400మొక్కలు నాటారు. ఆ బ్లాకుల పనులు పూర్తిస్థాయిలో చేపట్టారు. ఐదు బ్లాకుల నందు పనులు నిర్వహించాల్సి ఉంది. పూర్తైన వనాల్లోని మొక్కల రక్షణ బాధ్యత గ్రామ పంచాయతీ వారిది. వాటిని పెంచడం, రక్షణ ఖర్చు గ్రామ పంచాయతీ వారిది. వాటి మీద వచ్చే ఆదాయం గ్రామ పంచాయతీది. అపరిశుభ్రంగా ఉండే ప్రదేశాన్ని సరిచేసి మొక్కలు నాటినందుకు ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నాం



సంపద వనాల పనులు మండలంలో యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నాం. అధికారులు పర్యవేక్షించి పలు సూచనలు ఇస్తున్నారు. వారి సూచన మేరకు పనులు చేపట్టి సత్ఫలితాలు సాధించాము. మొక్కలు నాటి మండల లక్ష్యాన్ని నెరవేస్తా.

– ఏపీఓ శైలజ

### త్వరలో మిగిలిన పనులు పూర్తి చేస్తాం



పచ్చదనం పెంపే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నది. మండలంలో సంపద వనాల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్ని పూర్తవగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేస్తాం. వనాల్లో కలప, వెదురు మొక్కలతో పాటు సీతాఫలం, మామిడి, నేరేడు, జామ, పనస పండ్ల మొక్కలు నాటాం.

– వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ


చిలుకూరు మండలంలోని రామచంద్రానగర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

## గ్రామాల సర్వతోముఖాభివద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, అక్టోబర్ 8 : రాష్ట్రంలోని గ్రామాల సర్వతోముఖాభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని రామచంద్రానగర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి నెలా విడుదల చేస్తున్న పల్లె ప్రగతి నిధులతో గ్రామాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతన్నాయని తెలిపారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. పేదల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తుంటారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాల పార్టీలకు కండ్లు మండుతున్నాయని విమర్శించారు. ప్రజలు విపక్ష నాయకులను నమ్మకుండా మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు క్రీడా పరికరాలు అందించారు. కార్యక్రమలో సర్పంచ్ పాయిలీ రమేశ్, ఉపసర్పంచ్ బుడిగం సంధ్యాకిరణ్, ఎంపీటీసీలు నాయకులు సత్యనారాయణ, నాగరాజు, కిశోర్, కార్యదర్శి రాముడు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అధికార ప్రతినిధిగా వెంకటేశ్వర్లు

కోదాడ టౌన్, అక్టోబర్ 8 : బీఆర్‌ఎస్ కోదాడ నియోజకవర్గ లీగల్ సెల్ అధికార ప్రతినిధిగా కోదాడకు చెందిన సీనియర్ న్యాయవాది యడవల్లి వెంకటేశ్వర్లును నియమించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆయనకు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదివారం నియామకపత్రం అందించారు. ఆయనతో పాటు సహాయ అధికార ప్రతినిధులుగా సెగ్గెం వెంకటాచలం, షేక్ నాగుల్ పాషను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చేసిన కృషిని అధికార ప్రతినిధులు వివరించాలని కోరారు. కార్యక్రమంలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగర్జున్‌రావు, బీఆర్‌ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు రాంరెడ్డి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

మోతె, అక్టోబర్ 8 : మండలంలోని కూడలి, అప్పన్నగూడెం గ్రామాల్లో ఆదివారం చేపట్టిన 13వ విడుత సామాజిక తనిఖీలో ఏపీఓ మహేశ్ పాల్గొని మాట్లాడారు. 2021–23 మార్చి వరకు గ్రామాల్లో నిర్వహించిన పనులపై తనిఖీ బృందం వారు పర్యటించి పనులు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆ పనులు నిర్వహించారా లేదా, అందుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడ్డారా అని పరిశీలించినట్లు తెలిపారు. తనిఖీ బృందం వారు పరిశీలించిన పనులను గ్రామసభలో సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచులు పొనుగోటి నర్సింహారావు, పద్మ, వాసంశేటి రమేశ్, ఎస్ఆర్పీలు రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణిత పోటీ పరీక్ష

మోతె, అక్టోబర్ 8 : సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు గణిత ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ దామల్ల కోటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీహెచ్ఎస్, కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. పోటీ పరీక్షలో పాల్గొనేందుకు 1నవంబర్ 2023 వరకు ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించారు. నవంబర్ 5న సూర్యాపేట బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ కార్యక్రమాలు నచ్చి బీఆర్‌ఎస్‌లో చేరికలు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సైదులుయాదవ్


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మండలాధ్యక్షుడు సైదులు

మోతె, అక్టోబర్ 8 : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులుయాదవ్ అన్నారు. మండలంలోని విభలాపురం, నాగయ్యగూడెం గ్రామాల కాంగ్రెస్ పార్టీ 20కుటుంబాల వారు ఆదివారం ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికీ చెందుతున్నాయన్నారు. అందువల్లే వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. కాళేశ్వరం జలాలతో మోతె మండలాన్ని సస్యశ్యామలంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాల మేరకు మండలంలో పార్టీ బలోపేతానికి గ్రామాల్లో వార్డుల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరె లింగారెడ్డి, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వర్‌రావు, మైనంపాటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జానిపాష, రామకోటయ్య, కారింగుల శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, కొత్తపల్లి కృష్ణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోదాడ, అక్టోబర్ 8 : కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల 1981–84 బ్యాచ్ ఆర్ట్స్ విద్యార్థులు పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మునగాల, అక్టోబర్ 8 : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని తాడువాయి, వెంకటరామాపురం, నెలమర్రి, గణపవరం గ్రామాల్లో వార్డు కమిటీల సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వార్డు కమిటీ సభ్యులు గ్రామాల్లో వార్డుల వారీగా మస్యలను పార్టీ దృష్టికి తేవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సహకార సంఘాల చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, నల్లపాటి శ్రీనివాస్, ఉప్పల యుగంధర్‌రెడ్డి, ఎలక నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగాల, అక్టోబర్ 8 : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో రావాలని పేర్కొన్నారు.